సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 4 । మార్చి । 2025



బల్క్ డ్రగ్ పార్క్ కు భూసేకరణ

రాజయ్యపేట సమీపంలో బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణానికి రెండో విడత భూసేకరణ ప్రక్రియను ప్రారంభించారు. 8లో



ఇంటర్ ద్వితీయ పరీక్షలు ప్రారంభం

జిల్లాలో ఇంటర్ సెకండియర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	మంగళ	బుధ
అనకాపల్లి	6.08	4.58
నర్సీపట్నం	6.08	4.58

విజయకేతనం



విజయోత్సవ ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు



కూటమికి బెత్తం దెబ్బ

మొత్తం పోలైన ఓట్లు	20,791
చెల్లిన ఓట్లు	20,135
చెల్లని ఓట్లు	656
మ్యాజిక్ ఫిగర్	10,068
గాదె శ్రీనివాసులునాయుడుకి వచ్చిన ఓట్లు	12,035
మెజారిటీ	1967



కౌంటింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తున్న పోలింగ్ సిబ్బంది



సోమవారం రాత్రి ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ రహదారిపై ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

నాటకీయ పరిణామాలతో ఉద్రిక్తత

గాదె విజయం 9 గంటలకు ఖరారైంది. ఆర్వో కూడా సంతకం చేసి వెళ్లిపోయినా అధికారికంగా ప్రకటించకపోవడం, ధృవీకరణ పత్రం జారీ చేయకపోవడంతో కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతున్నట్లు పీఆర్టీయూ ప్రతినిధులు గ్రహించారు. టీడీపీ నాయకులు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్ రాత్రి 9.30 గంటల సమయంలో కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉపాధ్యాయుల్లో మరింత అనుమానాలు రేకెత్తాయి. గెలుపు విషయంలో ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతుందేమోనని గ్రహించారు. వెంటనే అధికారికంగా ప్రకటించి.. ధృవీకరణ పత్రం జారీ చెయ్యాలంటూ పట్టుబట్టారు. కానీ.. కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోవడంతో గాదె మద్దతుదారులు ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మెయిన్ ఎంట్రన్స్ రహదారిపై ధర్నాకు దిగారు. వెంటనే ధృవీకరణ పత్రాన్ని మంజూరు చేయాలంటూ నినదించారు. ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపడుతున్నారని గ్రహించిన టీడీపీ నేతలు అక్కడి నుంచి జారుకున్నారు. చివరికి పోలీసులు కౌంటింగ్ కేంద్రంలో ఉన్న గాదె శ్రీనివాసులు నాయుడు మద్దతుదారులతో ఫోన్‌లో మాట్లాడి.. ఇక్కడ అంతా సవ్యంగానే ఉందని చెప్పడంతో నిరసన ఉపసంహరించుకున్నారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి టీచర్లు ఝలక్

పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడికే అయ్యవార్లు పట్టం

వర్మ ఓట్ల లెక్కింపుతో గాదెకు 12,035 ఓట్లు వచ్చినట్లుగా ప్రకటన

- కూటమి ప్రభుత్వం మద్దతిచ్చిన పాకలపాటి రఘువర్మకు షాక్
- టీడీపీ, జనసేన నేతలు కాళ్లకు బలపాలు కట్టుకొని తిరిగినా పట్టించుకోని ఉపాధ్యాయులు
- ఫలించని ప్రజాప్రతినిధుల ప్రలోభాల ఎర
- తొమ్మిది నెలల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనం ఈ ఫలితం



ఆంధ్రా యూనివర్సిటీ దగ్గర ఉపాధ్యాయ సంఘాల నాయకుల విజయానందం

సాక్షి, విశాఖపట్నం/విశాఖ సిటీ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వానికి షాకిచ్చాయి. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే కూటమి పార్టీలకు ఉపాధ్యాయులు బెత్తం దెబ్బ రుచి చూపించారు. పాకలపాటి రఘువర్మను గెలిపించేందుకు టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు కాళ్లకు బలపాలు కట్టుకొని ఉత్తరాంధ్ర జిల్లాల్లో కలియతిరిగినా టీచర్లు కనికరించలేదు. ఓటుకు రూ.2 వేలు నుంచి రూ.10 వేలు వరకు ఇచ్చి ప్రలోభాల ఎర వేసినా లొంగలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడుకే పట్టం కట్టారు. ఈ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వానికి చెంప పెట్టులా పరిణమించాయి.

ప్రలోభాల ఎర వేసినా.. ఏజెంట్ల అవతారమెత్తినా..

పాకలపాటి రఘువర్మ విజయానికి కూటమి నేతలు ఎన్ని ప్రలోభాల ఎర వేసినా.. ఎమ్మెల్యేల నుంచి మంత్రుల వరకు ఎలక్షన్ ఏజెంట్ల అవతారమెత్తినా ఉపాధ్యాయులు కనికరించలేదు. వాస్తవానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా జరుగుతాయి. ఇటువంటి గౌరవప్రదమైన ఎన్నికలకు కూటమి ప్రభుత్వం రాజకీయ రంగు పులిమింది. ఏపీటీఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన పాకలపాటి రఘువర్మకు ముందు టీడీపీ, జనసేనలు మద్దతుగా నిలిచాయి. నామినేషన్ వేసిన దగ్గర నుంచి పోలింగ్ వరకు ఆ పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రఘువర్మ విజయం నల్లేరుపై నడకే అన్న తరహాలో ప్రచారం చేసుకుంటూ పోయారు. మరోవైపు కూటమి ప్రభుత్వం మద్దతు ఉన్న రఘువర్మను గెలిపిస్తేనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని వాట్సాప్ గ్రూపుల్లో విస్తృత ప్రచారం కల్పించారు. ఉత్తరాంధ్రలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వేర్వేరుగా ప్రత్యేక పార్టీలు, విందులు, వినోదాలు ఏర్పాటు చేశారు. ఓటుకు రూ.2 వేలు నుంచి రూ.10 వేలు వరకు ముట్టజెప్పారు. పోలింగ్ రోజున ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కేంద్రాల వద్ద టెంట్లలో ఎన్నికల ఏజెంట్ల తరహాల్లో ఓటర్ స్లిప్పులను సైతం అందించారు. ఇలా ఎన్ని చేసినా ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వాన్ని విశ్వాసంలోకి తీసుకోలేదు.

తొమ్మిది నెలలకే ప్రభుత్వంపై వ్యతిరేకత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం, రాష్ట్ర ఖజానాను నింపుకోవడం కోసం విద్యుత్, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడం, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వంపై అనతికాలంలోనే అన్ని వర్గాలకు ఆశలు సన్నగిల్లాయి. ప్రధానంగా ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై ఇప్పటివరకు దృష్టి పెట్టకపోవడంతో పాటు పీఆర్సీ కమిటీ ఏర్పాటు, ఐఆర్ వంటి వాటి ప్రస్తావనే చేయకపోవడంపై కూడా ఉద్యోగ వర్గాలు గుర్రుగా ఉన్నాయి. ఈ క్రమంలో జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు ప్రభుత్వానికి తమ దెబ్బ రుచి చూపించారు. టీడీపీ, జనసేన మద్దతిచ్చిన పాకలపాటి రఘువర్మను ఓడించి గాదె శ్రీనివాసులునాయుడును గెలిపించారు. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే ఇంతటి వ్యతిరేకతను మూటగట్టుకోవడంతో కూటమి శ్రేణులు డీలా పడ్డాయి. ఎమ్మెల్యేల నుంచి మంత్రుల వరకు రంగంలోకి దిగినప్పటికీ ఓటమి చవిచూడడంతో జీర్ణించుకోలేకపోతున్నాయి.

ఈవీఎం కాదు.. బ్యాలెట్ విజయమిది.!

గాదె విజయానంతరం పీఆర్టీయూ మద్దతుదారులతో కౌంటింగ్ కేంద్రం వద్ద కోలాహలం ఏర్పడింది. ఇది ఈవీఎం విజయం కాదనీ... బ్యాలెట్ బాక్సుల విజయమని కొందరు ఉపాధ్యాయులు వ్యాఖ్యానించడం గమనార్హం.



ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

తొలి నుంచి గాదెకు ఆధిక్యం



గాదెకు స్వీటు తినిపిస్తున్న ఉపాధ్యాయురాలు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కౌంటింగ్ ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైంది. ఉదయం 11.30 గంటలకు బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను 20 టేబుల్స్‌కు సరిపడేలా కట్టలు కట్టారు. మొత్తం 20,971 ఓట్లు పోలవ్వగా 656 ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. దీంతో 10,068 ఓట్లను మ్యాజిక్ ఫిగర్‌గా ప్రకటించారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఆది నుంచీ గాదె శ్రీనివాసులనాయుడు ఆధిక్యంలో కొనసాగారు. మొదటి ప్రాధ్యానత ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి గాదె 365 ఓట్ల ఆధిక్యంలో నిలిచారు. గాదెకు మొదటి ప్రాధ్యాన్యత ఓట్లు 7,210 రాగా, రఘువర్మకి 6,845 ఓట్లు, విజయ గౌరికి 5,804 ఓట్లు వచ్చాయి. మధ్యాహ్నం విరామం అనంతరం ఎలిమినేషన్ రౌండ్ల కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు కొనసాగింది. ప్రతి దశలోనూ గాదె ఆధిక్యం కొనసాగింది. మూడో స్థానంలో ఉన్న విజయ గౌరికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత లెక్కింపు చేపట్టారు. 9వ రౌండ్‌లో గాదె 9,237 ఓట్లతో మొదటి స్థానంలో నిలవగా.. వర్మకు 8,527 ఓట్లు వచ్చాయి. దీంతో తన ఓటమి ఖరారైందని భావించిన వర్మ కౌంటింగ్ కేంద్రం నుంచి నిరాశగా వెనుదిరిగారు. అయితే.. మ్యాజిక్ ఫిగర్ ఓట్లు సాధించేందుకు గాదె ఇంకా 831 ఓట్ల దూరంలో నిలిచారు.

1967 ఓట్ల మెజారిటీతో విజయం

అప్పటికే వర్మ బయటికి వెళ్లిపోవడంతో వర్మకి చెందిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లని లెక్కించాలా.. గాదె విజయాన్ని ధృవీకరించాలా అనే అంశంపై రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్, ఎన్నికల అబ్జర్వర్ ఎం.ఎం.నాయక్ ఎలక్షన్ కమిషన్‌కి అభ్యర్థించారు. మ్యాజిక్ ఫిగర్ వచ్చేంతవరకూ లెక్కించాలని చెప్పడంతో వర్మకి వచ్చిన ఓట్ల లెక్కింపును సాయంత్రం 6.45 గంటలకు ప్రారంభించారు. గాదె మ్యాజిక్ ఫిగర్ 10,068 ఓట్లకు చేరుకోగానే అధికారికంగా గాదె విజయం సాధించారు. మిగిలిన ఓట్ల లెక్కింపును కూడా పూర్తి చేశారు. చివరకు గాదెకు 12,035 ఓట్లు వచ్చాయి. రిటర్నింగ్ అధికారి గాదె విజయం సాధించినట్లు సంతకం చేసి ఎన్నికల కమిషన్ సంతకం కోసం విజయవాడ పంపించారు.

మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో అభ్యర్థులకు వచ్చిన ఓట్లు		9వ రౌండ్ చివరి ఎలిమినేషన్‌లో భాగంగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లు	
అభ్యర్థి	వచ్చిన ఓట్లు	వచ్చిన ఓట్లు	ఎలిమినేషన్
కె.విజయ గౌరి	5,804	-	8
డాక్టర్ కె.రాధాకృష్ణ	30	-	3
గాదె శ్రీనివాసులు నాయుడు	7,210	9,237	
దుర్గారావు	67	-	6
ఎన్.సూర్య ప్రకాష్	85	-	7
ఎస్.ఎస్.పద్మావతి	15	-	2
పి.రఘువర్మ	6,845	8,527	
పి.శివప్రసాద్ రావు	15	-	1
ఆర్.సత్యనారాయణ	31	-	4
డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు	33	-	5
మొత్తం	20,135	ఎలిమినేషన్స్ ఓట్లు 2,371	

నెగిటివ్ ఉండడం వల్లే ఓడిపోయాను..

పాకలపాటి రఘువర్మ, కూటమి బలపర్చిన అభ్యర్థి


ఆరేళ్లుగా ఉపాధ్యాయ సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశాను. అయినా ఓడిపోయాను. గత ఎన్నికల్లో యూటీఎఫ్‌తో కలిసి బరిలో దిగి విజయం సాధించాను. ఈసారి విడివిడిగా పోటీ చేయడం కూడా ఓటమికి ఒక కారణం. టీడీపీ, జనసేన వారం ముందు మాత్రమే మద్దతు ప్రకటించాయి. ఉపాధ్యాయుల్లో నెగిటివ్ ఉంది. ఆ నెగిటివ్ నామీద కాదు. ఓటమిని అంగీకరిస్తున్నాను. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తాను.



ఓటమి భారంతో వెనుదిరుగుతున్న టీడీపీ, జనసేన మద్దతు అభ్యర్థి రఘువర్మ

టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నిక తీర్పు.. కూటమికి చెంప పెట్టు

- 9 నెలలకే కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలే నిదర్శనం
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే ప్రచారం చేసినా తప్పని పరాజయం
- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విమర్శ



దేవరాపల్లి : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించడం కూటమి ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిదని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. ఈ మేరకు తారువలో సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులంతా శత విధాలుగా ప్రలోభాలకు తెరతీసినా ఘోర పరాజయం తప్పలేదని ఎద్దేవా చేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 9 నెలలకే కూటమి ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుందని, గతంలో ఏ ప్రభుత్వానికి ఇంతటి చేదు అనుభవం ఎదురుకాలేదన్నారు. కూటమిపై ఉపాధ్యాయులు తిరుగుబావుటా ఎగురు వేసి, ఓటమి రుచి చూపించారన్నారు. పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు చేతిలో కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మ ఘోర పరాజయం మోసపూరిత వాగ్దానాలతో దగా చేసిన ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. ఎన్నికల్లో గెలిచాక కనీసం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఒక్క డీఏ, ఐఆర్, పీఆర్సీ ఊసెత్తకుండా మోసగించడంతో కూటమికి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పారని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిష్పక్షపాతంగా అమలు చేయాలని, లేకుంటే రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా ప్రజా తీర్పు మాత్రం ఇదే మాదిరిగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఢిల్లీ మహిళా సదస్సుకు జెడ్పీటీసీ అనురాధ



కె.కోటపాడు: కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే మహిళా సాధికారితపై నిర్వహించే వర్క్‌షాపులో పాల్గొనేందుకు కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధకు ఆహ్వానం అందింది. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాపులో పాల్గొనేందుకు రాష్ట్రంలో ముగ్గురు జెడ్పీటీసీలకు ఆహ్వానం అందగా అందులో తనకు ఆహ్వానం అందడం ఆనందంగా ఉందని ఈర్లె అనురాధ అన్నారు. ఢిల్లీలో 4,5 తేదీల్లో జరిగే వర్క్‌షాపులో పాల్గొనేందుకు సోమవారం ఆమె బయలుదేరి వెళ్లారు. మహిళల నేతృత్వంలో స్థానిక సంస్థల బలోపేతం, పాలనా సామర్థ్యాల పెంపుపై ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమెకు పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

నవోదయం 2.0 ప్రారంభం



మాట్లాడుతున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరాంచంద్రమూర్తి తదితరులు

మాడుగుల: సారా రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే నవోదయం లక్ష్యమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి. శ్రీరామచంద్రమూర్తి అన్నారు. సోమవారం మండలంలో కొత్తవలస గిరి గ్రామంలో ఏర్పాటు చేసిన నవోదయం 2. 0 ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నవోదయం ద్వారా కళాజాత, అధికారులు ద్వారా సారా రహిత గ్రామాలుగా మార్చ దానికి ప్రజలను ఉత్తేజపరుస్తున్నామన్నారు. అనకాపల్లి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ డి. సుధీర్, మాడుగుల సీఐ సీహెచ్.వి.ఎస్. ప్రసాద్, ఎస్ఐ శ్రీనువాసరెడ్డి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

టెన్త్ హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

అనకాపల్లి టౌన్ : పదవతరగతి విద్యార్థులు తమ హాల్ టికెట్లను వాట్సప్ గవర్నెన్స్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావు నాయుడు తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో అభ్యర్థులు తమ వాట్సప్ ద్వారా 95523 00009 నెంబర్‌కి హాయ్ అని మెసేజ్ పంపి, సేవను ఎంచుకోని విద్యా సేవలు ఆప్షన్ పై క్లిక్ చేసి ఎస్ఎస్‌సి హాల్ టికెట్‌ని ఎంచుకొని, విద్యార్థి అప్లికేషన్ నంబర్‌ని నమోదు చేసి, పుట్టిన తేదీ నమోదు చేయాలని, ఆపై స్ట్రీమ్‌లో రిసీవ్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలని ఆయన వివరించారు. ఈ హాల్ టికెట్‌ను సంబంధిత పాఠశాలల యాజమాన్యాలతో సరిచూసుకోవాలని సూచించారు.

పవర్ లిఫ్టింగ్‌లో హెడ్ కానిస్టేబుల్ ప్రతిభ



శ్రీనివాసరావును అభినందిస్తున్న ట్రైనీ డీఎస్పీ చైతన్య

నర్సీపట్నం : రత్నమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నర్సీపట్నం రూరల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె. శ్రీనివాసరావు గోల్డ్ మెడల్ సాధించారు. మాస్టర్స్ కేటగిరిలో 95 కిలోల విభాగంలో కాంస్య పతకం, రెడ్ లిఫ్ట 110 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. శ్రీనివాసరావును, కోచ్ లోవరాజును ట్రైనీ డీఎస్పీ చైతన్య, రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ, టౌన్ సీఐ గోవిందరావు అభినందించారు. ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు అర్హత సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు.

నైపుణ్య శిక్షణ ఇస్తే కొత్త డిజైన్ల తయారీ

- కలెక్టర్‌కు విన్నవించిన ఏటికొప్పాక హస్త కళాకారులు
- బొమ్మల తయారీ పరిశీలించిన కలెక్టర్ విజయకృష్ణన్
- ఉత్పత్తి వ్యయం, ఆదాయంపై ఆరా
- అంకుడుకర్ర డిపో ఏర్పాటు, బొమ్మలకు మార్కెటింగ్ సదుపాయం కోసం హస్తకళాకారుల వినతి



ఏటికొప్పాకలో లక్కబొమ్మల తయారీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

యలమంచిలి రూరల్ : అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సోమవారం పరిశీలించారు. అంకుడు కర్ర, సహజసిద్ధమైన రంగులతో తయారుచేసే బొమ్మలను కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. రాష్ట్రపతి అవార్డు అందుకున్న హస్త కళాకారుడు శ్రీశైలపు చిన్నయాచారి ఏర్పాటు చేసిన బొమ్మల తయారీ పరిశ్రమ, హస్తకళాకారుల కాలనీలకు వెళ్లి ఆమె బొమ్మల తయారీని పరిశీలించారు. ఆ పరిశ్రమలో సుమారు 200 మంది మహిళలు బొమ్మలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. హస్తకళాకారుడు చిన్నయాచారి ఆమెకు బొమ్మల తయారీ విధానం, వాడే ముడి పదార్థాలు, ఉపయోగించే రంగుల గురించి విపులంగా వివరించారు. లక్కబొమ్మల తయారీ ద్వారా ఎంత లాభం వస్తుంది? అని కలెక్టర్ అడిగారు. ఉత్పత్తి వ్యయం పోనూ సుమారు 30 నుంచి 35 శాతం లాభం వస్తుందని చిన్నయాచారి తెలిపారు. ఒకే తరహా డిజైన్లు కాకుండా కొత్త డిజైన్లు తయారు చేయగలరా? అని ఆమె అడగ్గా డిజైనర్లతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తే ప్రస్తుత మార్కెట్ అవసరాలకు తగినట్లుగా బొమ్మలు తయారు చేయగలుగుతామన్నారు. ముఖ్యంగా బొమ్మల తయారీకి అవసరమైన అంకుడు కర్ర కొరత కారణంగా బొమ్మల తయారీ వ్యయం బాగా పెరిగిపోతోందని హస్తకళాకారులు కలెక్టర్‌కు తెలిపారు. అంకుడుకర్ర సాగు పెంచి, అటవీ శాఖ అనుమతితో కళాకారులకు అందుబాటులో డిపో ఏర్పాటు చేస్తే అందరికీ ప్రయోజనం కలుగుతుందన్నారు. బ్యాంకుల నుంచి రుణ సదుపాయం, తాము తయారు చేసిన బొమ్మలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పరేడ్‌లో లక్కబొమ్మల శకటం మూడో స్థానంలో నిలవడానికి కారణమైన హస్తకళాకారుడు సంతోష్‌ను ఆమె అభినందించారు. కార్యక్రమంలో కలెక్టరు వెంట డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, ఎంపీడీవో కొండలరావు, డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, ఎంఈవో అరుణ్ కుమార్, మండల ఇంజినీర్ చంద్రశేఖర్, ఏవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాడుగుల మోదకొండమ్మ తీర్థం



మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని నగలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారన్నారు. అదేరోజు ఆలయం వద్ద సింహాద్రిప్పన్న తోడపెద్దు సాముగరిడీ సేవ ఉంటుందన్నారు. మధ్యాహ్నం ఎడ్ల పరుగు పందెం, తండోలా బ్యాండ్, బేతాళ డ్యాన్సు తోపాటు పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

10లోగా అభ్యంతరాల స్వీకరణ

అనకాపల్లి: జిల్లాలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితా ప్రచురణ, అభ్యంతరాలు స్వీకరణ ఈ నెల 10వ తేదీ లోపు విశాఖ విద్యా శాఖ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అందించాలని జిల్లా విద్యా శాఖ ఏడీ జి.ఆర్.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు తర్వాత అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమన్నారు. ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుని సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు తెలియజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు http//riter.google.com/rite/doevizan2లో వివరాలను అందుబాటులో ఉంటాయన్నారు.

అసాంఘిక శక్తులపై నిఘా పెంచండి

- ఎస్పీ తుహిన్ సిన్హా
- అనకాపల్లి పోలీస్‌స్టేషన్ సందర్శన



పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీసీ ఫుటేజీను పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులపై నిఘాపెంచాలని, పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. సోమవారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వివిధ విభాగాలను సీసీ ఫుటేజీలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు సీడీ ఫైళ్లను పరిశీలించి, వారి పురోగతిపై సమగ్ర విచారణ చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సాధించాలని, గంజాయి సేకరించే వారి సమాచారాన్ని సేకరించి, వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నాని కోరారు. స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ నిర్వహించాలని, వారి కదలికలపై దృష్టి సాధించాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకు రాత్రి సమయంలో చోరీలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు(మహిళా పోలీసులు) స్థానిక పోలీసులతో కలిసి స్కూళ్లు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టి.వి.విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్ఐలు డి.ఈశ్వరరావు, అల్లు వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

అనకాపల్లి: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్ స్కూల్) ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జిల్లాలో మొదటి రోజు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయి. తొలి రోజు ఆంగ్లం పరీక్షకు 1,300 మంది విద్యార్థులకుగాను 1,190 మంది రాయగా, 110 మంది గైర్హాజరైనట్లు డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించామని, ఏడు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అనకాపల్లి కేంద్ర పరిధిలో 5, యలమంచిలి పరిధిలో 2 పరీక్ష కేంద్రాల్లో ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీలు నిర్వహించాయన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కు కోసం భూముల సర్వే

నక్కపల్లి : మండలంలో రాజయ్యపేట సమీపంలో బల్క్ డ్రగ్ పార్క్(బీడీపీ) నిర్మాణానికి సంబంధించి రెండో విడత భూసేకరణ, భూములు, రైతుల గుర్తింపు ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ వారు 4500 ఎకరాలు సేకరించిన విషయం తెలిసిందే. బల్క్ డ్రగ్ పార్క్ కోసం మొదటి విడతలో 2 వేల ఎకరాలు కేటాయించారు. మిగిలిన భూమిని ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించారు. అయితే బల్క్ డ్రగ్ పార్క్ కోసం మరో వెయ్యి ఎకరాలు కావాల్సి ఉంది. దీంతో పెదతీనార్ల, దొండవాక, సిహెచ్.ఎల్.పురం గ్రామాల్లో వెయ్యి ఎకరాలు గుర్తించారు. సోమవారం నుంచి ఈ భూములు సర్వే చేయడం, రైతుల పేర్లు, సాగుదార్ల వివరాలు నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమయింది. జిరాయితీ, డీ ఫారం, ప్రభుత్వ భూములను సాగుచేసే వారి వివరాలు సేకరిస్తున్నారు. వివరాల సేకరణ పూర్తయిన తర్వాత నివేదిక సమర్పించడం జరుగుతుందని తహసీల్దార్ నర్సింహమూర్తి తెలిపారు. తదుపరి ఈ వెయ్యి ఎకరాల కోసం 4(1) నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందన్నారు.రైతుల సమక్షంలోనే భూముల గుర్తింపు జరుగుతోందన్నారు.

ఇంటర్ ద్వితీయ పరీక్షలు ప్రారంభం

యలమంచిలి రూరల్ : జిల్లాలో ఇంటర్ సెకండియర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 34 కేంద్రాల్లో 12,318 మంది విద్యార్థులకు గాను రెండోరోజు పరీక్షకు సీనియర్ ఇంటర్ విద్యార్థులు 12,038 మంది హాజరయ్యారు. 280 మంది గైర్హాజరైనట్టు అధికారులు ప్రకటించారు. 97.72 శాతం హాజరు నమోదైంది. జిల్లాలో ఇంటర్ సెకండియర్ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9 గంటల తర్వాత ఇక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేయడంతో చివరి నిమిషంలో వచ్చిన విద్యార్థులు కేంద్రాలకు పరుగులు తీశారు. పలువురు తల్లిదండ్రులు విద్యార్థులను సొంత వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు తీసుకువచ్చి మానసిక ఒత్తిడికి గురి కాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని చెప్పి కేంద్రాల్లోకి పంపించారు. సోమవారం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, ఇతర ద్వితీయ భాష పరీక్షలు జరిగాయి. మాస్ కాపీయింగ్ జరగకుండా వెబ్ కాస్టింగ్ ద్వారా కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ తీరును డీఐఈవో బీ సుజాత జిల్లా కార్యాలయం నుంచి పర్యవేక్షించారు. ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ ఆదేశాలతో పోలీసు అధికారులు,సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్సు, ఇంటర్‌నెట్ కేంద్రాలను మూసివేయించారు.

ట్రాఫిక్ రూల్స్ పేరిట బాదుడు

- సీఎం చంద్రబాబు సంపద సృష్టిస్తానన్నది ఇలాగేనా...
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక : కొత్త ట్రాఫిక్ రూల్స్ ప్రజలపై మరింత భారం పడేలా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాల పేరిట పెద్దమొత్తంలో జరిమానాలు విధించడం అన్యాయమన్నారు. సీఎం చంద్రబాబు సంపద సృష్టిస్తానంటూ చెప్పుకుంటున్నారని.. సంపద అంటే పేద వర్గాల ప్రజలపై భారం మోపడమేనని ఇపుడే తెలుస్తుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు కాలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ట్రాఫిక్ రూల్స్ పేరిట ప్రజలపై మరింత భారం పడేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ట్రాఫిక్ రూల్స్‌ను కఠినతరం చేయకుండా జరిమానాలు తగ్గించేలా చూడాలన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా పనిచేసిన కాలంలో అన్ని వర్గాల వారు సుఖంగా జీవించేవారని ఆయన గుర్తు చేశారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. అరబుపాలెం, మూలపేట సర్పంచ్‌లు బొడ్డేడ శ్రీనివాసరావు, భీశెట్టి గంగప్పలనాయుడు పాల్గొన్నారు.

ఇద్దరు పాత నేరస్తుల అరెస్ట్



పట్టుబడ్డ నేరస్తులు, స్వాధీనం చేసుకున్న సొత్తుతో డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది



సిబ్బందికి నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

- వారిపై వందకు పైగా కేసులు
- రూ.15 లక్షల సొత్తు రికవరీ

నర్సీపట్నం : నర్సీపట్నంకు చెందిన ఇద్దరు కరుడు కట్టిన నేరస్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సోమవారం ఉదయం రౌతు మల్లేష్, గెడ్డం రామ నవీన్ స్కూటీపై గంజాయి రవాణా చేస్తుండగా ముందస్తు సమాచారం మేరకు టౌన్, రూరల్ సీఐలు గోవిందరావు, ఎల్.రేవతమ్మ, సీసీఎస్ సిబ్బంది సోమవారం ఉదయం లక్ష్మీపురం గ్రామం వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి 22 కిలోల గంజాయి, 2 స్మార్ట్ ఫోన్‌లు, ఒక కీప్యాడ్ ఫోను, బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి అభరణాలు, రూ.45 వేలు నగదుతో పాటు మొత్తం రూ.15 లక్షల సొత్తు రికవరీ చేశామన్నారు. రౌతు మల్లేష్‌పై ఇప్పటికే వంద కేసులు ఉన్నాయన్నారు. ఇతను చోరీ కేసుల్లో అరెస్ట్ అయి కొన్ని కేసుల్లో శిక్షపడి చాలా ఏళ్లు జైలు జీవితం కూడా గడిపాడు. గాజువాక పోలీస్ స్టేషన్లో కేసులు ఉన్నాయన్నారు. ఇతనిపై రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో 66 కేసులు విచారణలో ఉన్నాయన్నారు. వీరి వద్ద నుంచి రూ.15 లక్షల సొత్తు రికవరీ చేశామన్నారు. కొన్ని మారణాయుధాలు, గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. రౌతు మల్లేష్ క్రూరత్వంతో ఎదుట వారిపై ఎదురుదాడి చేస్తాడన్నారు. ఇటీవల నర్సీపట్నం ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం, ఒకరి ఇంట్లో వస్తువులను తగులబెట్టిన ఘటనలో మల్లేష్ రాళ్లు రువ్వి ఎదురు దాడి చేశాడన్నారు. గాజువాక పోలీసులపై కూడా దాడి చేసాడన్నారు. జైలు నుంచి వచ్చిన వెంటనే ఇళ్లల్లో దొంగతనాలు చేస్తాడని, ఇతని ఇద్దరు కుమారులు కూడా హత్యాయత్నం కేసుల్లో నిందితులుగా ఉండి ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారన్నారు. ఇతని ప్రధాన అనుచరుడు గెడ్డం రామ నవీన్ కూడా పలు చోరీ కేసుల్లో మల్లేష్‌కు సహాయకారిగా ఉన్నాడన్నారు. గంజాయి అక్రమ రవాణా, చోరీ సొత్తులు విక్రయించడంలో ఇతనిపై కూడా ఐదు చోరీ కేసులు, ఒక గంజాయి కేసు ఉందన్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. కరుడు కట్టిన నేరస్తులను పట్టుకున్న పోలీసు సిబ్బందికి డీఎస్పీ నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సమావేశంలో ట్రైనీ డీఎస్పీ చైతన్య, ఎస్ఐలు రమేష్, ఉమామహేశ్వరరావు, దామోదర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడు అరెస్టు



నిందితుడితో రావికమతం ఎస్ఐ రఘువర్మ

రావికమతం: అనధికారికంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని రావికమతం ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపారు. మండలంలో మేడివాడలో అనధికారికంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న సమాచారం మేరకు సోమవారం తనిఖీలు చేపట్టగా జంక్షన్‌లో 48 మద్యం సీసాలతో పప్పల ఆదర్శ్‌ను పట్టుకొని మద్యం స్వాధీనం చేసుకొని ఆయనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

తురువోలులో రెండు పూరిల్లు దగ్ధం


- రూ.3 లక్షల ఆస్తి నష్టం



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పాత్రిన సురేష్

చీడికాడ: మండలంలోని తురువోలులో ఆదివారం అర్ధరాత్రి రెండు పూరిల్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కంచిపాటి రాము, చొక్కాకుల భగవంతులు వేర్వేరుగా టీ దుకాణం, పాన్‌షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో అర్ధరాత్రి 12 గంటలు సమయంలో విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల టీ దుకాణం, పాన్‌షాపు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో మూడు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాద బాధితులకు స్థానిక సంపత్ వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం నేత పాత్రిన సురేష్ ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేల చొప్పున అందజేశారు. దివ్యాంగుడైన కంచిపాటి రామును నియోజకవర్గ దివ్యాంగుల సంక్షేమ సంఘం నేతలు మతల అప్పలనాయుడు, పాత్రిన శ్రీరామూర్తి, తదితరులు సోమవారం పరామర్శించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రూ.4 లక్షల పొదుపు సొమ్ము స్వాహా



రాజగోపాలపురంలో విచారణ చేస్తున్న బ్యాంకు, వెలుగు అధికారులు

కోటవురట్ల : డ్వాక్రా సంఘంలో పొదుపు సొమ్ము స్వాహా అయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పొదుపు సొమ్ము స్వాహా అయినట్టు తెలియడంతో సభ్యులు లబోదిబో అంటున్నారు. కైలాసపట్నం శివారు రాజగోపాలపురానికి చెందిన అక్షయ, వేణు, భవానీ గ్రూపుల పొదుపు సొమ్ము సుమారు రూ.4 లక్షల పైబడి విలేజ్ బుక్ కీపర్ వేణమ్మ స్వాహా చేసింది. ఈమె సంఘ సభ్యుల ఫోర్జరీ సంతకాలతో 8 నెలలుగా పలు దఫాలుగా రుణాలు తీసుకుని సొమ్ము కాజేసినట్టు గుర్తించారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఏపీఎం సత్యవతి, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ గంగునాయుడు సోమవారం గ్రామంలో విచారణ చేపట్టారు. మరింత లోతుగా విచారణ చేస్తే మరింత నగదు స్వాహా అయినట్టు గుర్తించే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కూడా ఉన్నట్టు సభ్యులు ఆరోపిస్తున్నారు.

జిల్లాకు కొత్తగా 64 మంది ఆశా వర్కర్లు



శిక్షణ పూర్తి చేసుకున్న ఆశా వర్కర్లతో డీఎంహెచ్‌వో రవికుమార్

అనకాపల్లి: జిల్లాలో 64 మంది ఆశా కార్యకర్తలు విధుల్లోకి రానున్నారు. విశాఖ ఇండక్షన్ ట్రైనింగ్ మహిళా ప్రాంగణంలో నెల రోజులుగా వీరికి ఇస్తున్న శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో పడాల రవికుమార్ పలు సూచనలు ఇచ్చారు. విధుల్లో చేరిన ప్రతి ఆశా వర్కరు అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ చంద్రశేఖర్ దేవ్, జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, డీపీహెచ్ఎన్‌వో నాగమణి పాల్గొన్నారు.

వ్యాపారంలో రాణించండి

అచ్యుతాపురం: కొత్తగా వ్యాపారం చేయదలచిన వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎస్ఎంఈ టూల్ రూం ప్రిన్సిపల్ డైరెక్టర్ విజయ్‌కృష్ణ కాంత్ పిలుపునిచ్చారు. సోమవారం అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆయన మాట్లాడారు. వ్యాపారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నైపుణ్యాల గురించి వివరించారు. ఎంఎస్ఎంఈ సమన్వయకర్త ప్రకాష్, శ్రీనివాస్, ధరిమ్మరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

పరారైన గంజాయి నిందితుడి అరెస్ట్

రోలుగుంట: గంజాయి కేసులో పరారైన నిందితుడు మాకిరెడ్డి సతీష్‌ని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్టు ఎస్సై పి. రామకృష్ణారావు సోమవారం తెలిపారు. మండలంలోని జానకిరాంపురం గ్రామానికి చెందిన సతీష్‌పై మూడు గంజాయి కేసులు నమోదు కాగా, మూడు సంవత్సరాలుగా తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. అతడిపై కోర్టు మూడు నాన్ బెయిలుబుల్ వారెంట్లు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు ఏర్పాటు చేసిన రెండు బృందాలు గాలింపు చర్యలు చేపట్టగా, హైదరాబాదులో ఉన్నట్టు గుర్తించి పట్టుకుని కోర్టులో హాజరుపరిచామన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ వద్ద పారిశుధ్య కార్మికుల నిరసన



కలెక్టరేట్ ముందు నిరసన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

తుమ్మపాల: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి కాంట్రాక్టర్లకు అప్పగించి కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయించడం తగదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, కార్మికుల నుంచి వసూలు చేసిన పీఎఫ్, ఈఎస్ఐలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ నెల 11న మహా ధర్నా జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులు వేమగిరి రాజు, కుమార్, టి శ్రీను, ఈ చందరరావు, ఎం అప్పారావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలుపై ఆటో డ్రైవర్ల ధర్నా



ఆర్టీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీవో కార్యాలయం వద్ద ఆటో, మోటార్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారం చేపట్టి ఎనిమిది మాసాలు అవుతున్నప్పటికీ వాహన మిత్ర ఊసేలేదన్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆటో కార్మికులు తమ జీవనం కోసం కష్టపడుతుంటే ఖాకీలు కనికరం లేకుండా ప్రభుత్వాల ఖజానా నింపడం కోసం విపరీతమైన అపరాధ రుసుం విధించడం అన్యాయమన్నారు. జీవో నంబర్ 21, 31ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాహన మిత్ర కోసం బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించకపోవడం దారుణమన్నారు. యూనియన్ నాయకులు వారధి గోవింద్, పెదిరెడ్ల నాగేశ్వరరావు, వియ్యపు రాజు, త్రినాథ్, కె.ఈశ్వరరావు, మహేష్, రామ్మోహన్, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెవి, వినికిడి సమస్యలపై అప్రమత్తం

- డీఎంహెచ్‌వో పడాల రవికుమార్



ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తుమ్మపాల: ప్రజలందరూ చెవి, వినికిడి విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సమస్య వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందాలని డీఎంహెచ్‌వో పడాల రవికుమార్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఆస్పత్రిలో ప్రపంచ వినికిడి దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన దృక్పథం మార్చుకుని చెవి, వినికిడి జ్ఞానం పట్ల సాధికారతతో, వాస్తవికతతో జాగ్రత్తలు తీసుకుందాం' అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ 2025 సంవత్సర నినాదాన్ని ప్రజలకు రోగులకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ పరంగా అందచేసే వినికిడి పరికరాల సౌలభ్యం, పూర్తిగా చెవుడు వచ్చిన వారికి ప్రభుత్వ పరంగా పొందు పింఛను, ఇతర రాయితీలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త, జిల్లా కేంద్ర ఆస్పత్రి ప్రధాన అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా అసంక్రమిత వ్యాధుల నియంత్రణ సమన్వయకర్త, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారిణి డాక్టర్ జె.ప్రశాంతి, జిల్లా కేంద్ర ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగ నిపుణులు డాక్టర్ కె.కృష్ణారావు, డాక్టర్ వినోద్ కుమార్, చిన్నపిల్లల వ్యాధి నిపుణులు డాక్టర్ క్రాంతి, డాక్టర్ రమేష్, డాక్టర్ పృధ్వి, సిబ్బంది పాల్గొన్నారు.

6న ఆశాల చలో విజయవాడ

అనకాపల్లి : ఆశా వర్కర్ల సమస్యలపై ఛలో విజయవాడ కార్యక్రమం ఈనెల 6న నిర్వహిస్తున్నట్లు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.పార్వతి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏవో రమేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 45వేల మంది ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు అములు చేయడం లేదని, పనిభారం తగ్గించాలని, యాప్స్ పేరుతో వేధింపులు ఆపాలని, గత ప్రభుత్వ పోరాట కాలంలో ఇచ్చిన ఒప్పందాలు తక్షణమే అమలు చేయాలని కోరారు. యూనియన్ జిల్లా కోశాధికారి సూర్యకళ, సభ్యులు మంగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సెలవుతో తెరుచుకోని ఐసీటీసీ కేంద్రం

- మందుల కోసం ఇబ్బంది పడ్డ హెచ్ఐవీ బాధితులు



ఏరియా ఆస్పత్రిలో మూసి ఉన్న ఐసీటీసీ కేంద్రం

నక్కపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఐసీటీసీ కేంద్రం (ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటరు) సోమవారం తెరుచుకోలేదు. ఈ కేంద్రంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు ఒకేసారి సెలవు పెట్టడంతో నియోజకవర్గంలో హెచ్ఐవీ బాధితులకు ఉచిత మందులు అందక ఇబ్బంది పడ్డారు. ఈ కేంద్రంలో 600 మంది హెచ్ఐవీ బాధితులు వైద్య సహాయం పొందుతున్నారు. నెలకొకసారి రూ.10 వేల విలువైన మందులను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. రోజూ ఈ కేంద్రానికి వచ్చి మందులు తీసుకెళ్తుంటారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వారికి కేటాయించిన తేదీ ప్రకారం 25 మంది బాధితులు వచ్చారు. ఇక్కడ కేంద్రం మూసి ఉండటంతో వీరంతా దిక్కుతోచని స్థితిలో పడ్డారు. సాధారణంగా హైచ్ఐవీ బాధితుల వివరాలు గోప్యంగా ఉంచి మందులు అందజేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ సిబ్బంది సెలవులో ఉన్నారని కేంద్రం తలుపులపై నోటీసు అతికించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

భవిత కేంద్రానికి వితరణ



స్టీల్ కంచాలు, గ్లాసులు అందిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: దివ్యాంగులకు చేయూతనందించి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని సీఐ అల్లు స్వామినాయుడు అన్నారు. కశింకోటలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు 30 చొప్పున స్టీల్ కంచాలు, గ్లాసులు, పది కుర్చీలను సొంత నిధులతో ఆయన సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు సహాయం అందించి సహకారం అందిస్తే వారి బంగారు భవిష్యత్‌కు దోహదపడగలదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు పి.వి.సురేష్, కె.ఎస్.ఎన్.మూర్తి, ఎస్ఐ కె.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు ఆచంట రవి, భీశెట్టి ఆనంద్, కొరుప్రోలు వెంకటేశ్వరరావు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు రమణమ్మ, దీప, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమ సంఘ సమావేశం రేపు

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం బుధవారం జరగనుందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు తెలిపారు. ఈ సమావేశానికి ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ, ఇతర రాజకీయ నాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

త్రిపురాంతకస్వామికి ప్రత్యేక పూజలు

కశింకోట: కశింకోటలోని సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు.

పాఠశాలల్లో వ్యాస రచన పోటీలు



కశింకోటలో వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న బాలికలు

కశింకోట: మండలంలోని వివిధ పాఠశాలల్లో బాలికలకు సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మహిళలు భవిష్యత్‌లో లింగ సమానత్వం పొందడంలో పురుషుల పాత్ర' అంశంపై ఈ పోటీలు జరిగాయి. విజేతలకు మహిళా దినోత్సవం రోజు బహుమతులు అందజేయనున్నట్లు సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 8,351 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,690	4,600
మొదటి రకం	3,620	4,100
రెండో రకం	3,030	3,690
మూడోరకం	2,870	3,070

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ : రాజా
జాబిలమ్మ నీకు అంత కోపమా : సత్యనారాయణ స్క్రీన్-1(ఉదయం,మ్యాట్నీ)
పుష్ప-2 : సత్యనారాయణ స్క్రీన్-1 (1,2 షోలు)
అగాథియా : సత్యనారాయణ స్క్రీన్-2
మజాకా : పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం : షిర్డీసాయి
గార్డ్ : వెంకటేశ్వర(ఉదయం)
తండేల్ : శ్రీసత్య
శబ్దం : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 347 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన నంబరులో సంప్రదించవచ్చు.

పడకేసిన పారిశుధ్యం!

- కాలువల్లో పేరుకుపోయిన చెత్త
- మురుగునీరు నిల్వతో దుర్గంధం
- ప్రజలకు తప్పని దోమల బెడద



పట్టణంలో ఎల్లయ్య కాలువలో పేరుకుపోయిన చెత్త

అనకాపల్లి టౌన్: పడకేసిన పారిశుధ్యంతో అనకాపల్లి పట్టణ వాసులు సతమతమవుతున్నారు. కాలువల్లో చెత్త పేరుకుపోయింది. మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పాటు ప్రజలకు దోమల బెడద తప్పడం లేదు. సాధారణంగా ఏటా వర్షాకాలం నాలుగు నెలలు దోమలు వ్యాప్తి అధికంగా ఉంటుంది. కానీ ఎన్నడూ లేని విధంగా మార్చిలో దోమలు విజృంభిస్తున్నాయి. పట్టణంలో ప్రతి రోజూ వేలాది ఇళ్ల నుంచి వస్తున్న వ్యర్థాలతో డ్రైనేజీలు నిండిపోతున్నాయి. డ్రైనేజీ నిర్వహణలో బాధ్యతారాహిత్యం కారణంగా వందల టన్నుల చెత్తతో కాలువలు పేరుకుపోతున్నాయి. పారిశుధ్య కార్మికులు రోడ్లను శుభ్రం చేస్తూ వచ్చే చెత్తను కాలువల్లోకి తోసేస్తున్నారు. ఇలా కాలువలు చెత్తతో నిండిపోతున్నాయి. పట్టణంలో మేజర్ డ్రైన్ సుమారు 16.365 కిలోమీటర్లు, మీడియం డ్రైన్ 26.01 కిలోమీటర్లు, మైనర్ డ్రైన్ 122.686 కిలోమీటర్లు ఉంది. ఈ మేరకు సిల్టు తొలగించాల్సి ఉంది. కానీ ఎక్కడా అలా జరగడం లేదు. 25 ఏళ్ల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా 350 మంది పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు ఉండేవారు. వారిలో 150 మంది ఉద్యోగ విరమణ చేశారు. 98 మంది టెంపరరీ కార్మికులు కలిపి ఇప్పుడు 198 మంది మాత్రమే షిఫ్టులలో పని చేస్తున్నట్టు రికార్డులు చెబుతున్నాయి. పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల నియామకాలు చేపట్టలేదు.



చెత్తా, చెదారంతో నిండిన కాలువ

కానరాని యాంటీ లార్వా ఆపరేషన్

సాయంత్రం అయితే అక్కడక్కడా దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు. పూర్తి స్థాయిలో యాంటీ లార్వా ఆపరేషన్ పనులు మాత్రం ఎక్కడా నిర్వహించడంలేదు. ఎంఎల్ ఆయిల్ బాల్స్ కాలువల్లో విడిచిపెట్టడం, నీటి నిల్వల్లో గంబూషియా చేపలు విడిచిపెట్టడం వంటి పనులు ఎక్కడా దాఖలాలు లేవు. దీంతో దోమలు వ్యాప్తి పెరిగిపోయింది. ఫలితంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పూడిక తీయడం లేదు..



ఇంట్లో దోమల బారిన పడకుండా అనేక చర్యలు తీసుకుంటున్నాం. అయినా ఫలితం ఉండడం లేదు. ఎప్పటికప్పుడు కాలువల్లో పూడిక తీయడం లేదు. వాడుక నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది.

– వరహాలు, అనకాపల్లి

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

పట్టణంలో డ్రైనేజీ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలో సర్వే చేపడుతున్నాం. పిల్ల కాలువలను ప్రధాన కాలువకు అనుసంధానం చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నాం. కాలువలో సిల్టు తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. గత ఏడాది రూ.30 లక్షలతో పనులు చేపట్టాం.

– సూరిశెట్టి శేఖర్, ఏఈ, జోన్-7, అనకాపల్లి

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధి హామీ కూలీలు

కశింకోట: బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సీడ్ ఆర్గనైజేషన్ కో–ఆర్డినేటర్ కె.వి.చిన్నారావు హెచ్చరించారు. మండలంలోని తేగాడ, పేరంటాలపాలెం గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం సీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి పథకం కూలీలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు నిర్మూలించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 31, 39 ప్రకారం బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై తక్షణ చర్యలు తప్పవన్నారు. 18 ఏళ్లలోపు వయస్సు ఉన్న ఆడ పిల్లలకు వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలతో పిల్లల ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్ ఆర్గనైజేషన్ సీఎస్‌డబ్ల్యూ మహాలక్ష్మి, కార్మిక శాఖ అధికారి కె.బాలకృష్ణ, సీడ్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి: శారదానగర్‌లో స్కూటీలో 10 మద్యం బాటిల్స్ తరలిస్తున్న శ్యామ్‌కుమార్‌పై పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ సోమవారం కేసు నమోదు చేశారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులు మద్యం బాటిల్స్ గుర్తించారు. ఈ మేరకు శ్యామ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

బకాయిల కోసం కార్మికుల ధర్నా



జోనల్ కార్యాలయం గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి: గతేడాది అక్టోబర్ నుంచి బకాయిపడిన జీతాలను తక్షణమే చెల్లించాలని జోన్ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు స్థానిక జోనల్ కార్యాలయం గేటు వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల సంఘం నాయకుడు నరసింహారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కార్మికుల కష్టాలు పెరిగిపోయాయన్నారు. చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నప్పటికీ కాంట్రాక్టర్ గతేడాది అక్టోబర్ మాసం నుంచి జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. జోనల్ కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకుని కార్మికుల జీతాలు చెల్లించాలని ఆయన కోరారు. లేని పక్షంలో సమ్మెకు సిద్ధం కానున్నట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు గర్హనీయం



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ వర్గీయులకు ఏ ఒక్క పని చేసినా ఒప్పుకోనని అధికారులకు సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇవ్వడం ఎంతవరకూ సమంజసమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఎన్నికల వరకు పార్టీలని, గెలిచిన తర్వాత ప్రజలందరికీ ముఖ్యమంత్రి అని గుర్తించకుండా టీడీపీకి మాత్రమే తాను సీఎంగా ఉన్నట్లు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ కూడా కూటమి వారికే పథకాలు అనే విధంగా రూపకల్పన చేశారని విమర్శించారు. రూ.1.20 వేల కోట్ల అప్పు ఎవరికి ఇచ్చారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. అలా కాకుండా తమకు నచ్చినట్లు అప్పులు తెచ్చుకుంటాం.. నచ్చినట్లు ఖర్చు చేసుకుంటామంటే ప్రజా వ్యతిరేకత తప్పదన్నారు. కూటమి ఎనిమిది నెలల పాలనలో ఇది తేలిపోయిందన్నారు. పథకాలు అమలు చేయాలని సామాన్యులు ప్రశ్నిస్తే, కక్షపూరితంగా అరెస్టులు చేసి, కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారం చేపట్టిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చెప్పి ఏడాదికి ఒక పథకం మాత్రమే అమలు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో కరోనా వంటి విపత్తుల్లో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసి మన్ననలను పొందారన్నారు.

అ'పూర్వ' కలయిక



జాతీయ స్థాయి ఖోఖో కోచ్ సత్యనారాయణను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లి: జీవీఎంసీ గవరపాలెం చిన్న హైస్కూల్‌లో 1956 నుంచి 2023 వరకు 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సిద్ధార్థ లా కాలేజీలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ మొదటి సారిగా ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించామని, వచ్చే ఏడాది మరింత మందితో భారీ స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కోచ్‌గా నియమితులైన కె.ఎస్.వి.సత్యనారాయణను పూర్వ విద్యార్థులు సత్కరించారు.

ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు, కమిటీ చైర్మన్ పిళ్లా శివఅప్పారావు, సభ్యులు పొన్నా వెంకటాచలం, బుద్ద వీరునాయుడు, కరణం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి: జిల్లాలో మైనింగ్ మాఫియాను అదుపు చేయడంలో మైనింగ్ అధికారులు విఫలమైనట్లు సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురువయ్యయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి మండలం మాకవరం గ్రామంలో మైనింగ్ మాఫియా రోజుకు 1500 నుంచి 2వేల టన్నుల రాయిని ఎటువంటి అనుమతులు లేకుండా కొండలను పిండి చేసి తరలించుకుపోతున్నారని తెలిపారు. దీనిపై జిల్లా మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన మైనింగ్‌కు అడ్డాగా మారిందని ఆయన విమర్శించారు.

మార్కెట్‌లో షాపుల బంద్

అనకాపల్లి టౌన్: స్థానిక కాయగూరల మార్కెట్‌లో చిల్లర వ్యాపారులు సోమవారం తమ దుకాణాలను మూసివేశారు. తోటి వ్యాపారస్తురాలు పరదేశమ్మ అకాల మరణానికి సంతాపంగా తమ షాపులను మూసివేసి సంతాపం తెలిపారు. హోల్‌సెల్ వ్యాపారాలు యథావిధిగా సాగాయి.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నేడు

దేవరాపల్లి: మండలంలోని కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ గంధం రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశామని, ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలను నిర్వహించి విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున అందజేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మహిళల కోలాటం, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

రాంబిల్లి(యలమంచిలి): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సిఐ సిహెచ్.నరసింగరావు సోమవారం రాత్రి తెలిపారు. మండలంలో పెదకలవలాపల్లి గ్రామంలో 12 మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, ఆయన నుంచి రూ.1800 నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు.

నేడు పాడి పశువులకు బీమా

మాడుగుల రూరల్: విశాఖ డెయిరీ ద్వారా పాడి పశువులకు కె.జె.పురం పాల సొసైటీల వద్ద రెండు రోజులు పాటు పశువుల బీమా చేస్తామని స్థానిక సొసైటీ అధ్యక్షుడు యల్లపు వెంకట శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం కె.జె.పురం -1 సొసైటీ వద్ద బుధవారం 2వ పాల సొసైటీ వద్ద పాడి గేదెలు, ఆవులకు బీమా చేస్తారన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు రుణాల మంజూరు



కొత్తగా మహిళలకు రుణాల చెక్కును అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం రమణ

అనకాపల్లి: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర కార్యాలయం జనరల్ మేనేజర్ జి.ఎస్.వి.రమణ తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డు సన్‌కాస్ట్ ఫంక్షన్ హాల్లో సోమవారం అనకాపల్లి, అల్లూరు సీతారామరాజు జిల్లాల వ్యాపారస్తులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం వల్ల సబ్సిడీ ఎక్కువగా వస్తుందన్నారు. అనంతరం కొత్తగా వ్యాపారాలు చేసుకునే రెండు జిల్లాల మహిళా వ్యాపారులకు రూ. 20 కోట్ల రుణాలను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ యూనియన్ జోనల్ హెడ్ షాలిని, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా డీఆర్‌డీఏ పీడీ సచిదేవి, బ్యాంక్ డీజీఎం నాగరాజు, డీఆర్ హెచ్ పి.ఎస్.రాజా, చీఫ్ మేనేజర్లు సింధుసాగర్, ప్రియంవర, దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, మేనేజర్లు, బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



కశింకోట సలాది వీధిలో కుళాయి ట్యాప్ లేక వృథాగా పోతున్న నీరు

కశింకోట: కశింకోట పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడం వల్ల మంచినీరు వృథాగా పోతోంది. దీంతో ఎగువ ప్రాంతాల్లోని ప్రజలకు నీరు సరిపోక ఇబ్బంది చెందుతున్నారు. కశింకోటలోని వీధి, ఇంటింటి కుళాయిలకు చాలా చోట్ల ట్యాప్‌లు లేవు. కస్పావీధి, గవరపేట, సలాది వీధి, ఉప్పునీటి దిబ్బ, మేదర వీధి, పూసర్ల వీధి తదితర ప్రాంతాల్లో కుళాయిలకు బిరడాలు లేవు. దీంతో కుళాయిల నుంచి నీరు వృథాగా పోతోంది. రానున్న వేసవిలో మరింత నీటి కొరతను ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. సత్వరమే కుళాయిలకు ట్యాప్‌లు అమర్చి తాగునీటి వృథాను అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ రహదారి ఆక్రమణకు యత్నం



మోదకొండమ్మ అమ్మవారి రహదారి మధ్యలో మట్టి వేసిన దృశ్యం

అనకాపల్లి: మండలంలో మార్టూరు గ్రామంలో మోదకొండమ్మ అమ్మవారి ఆలయ రహదారి ఆక్రమణకు జనసేన నాయకుడు సైకిల్ అప్పారావు ప్రయత్నిస్తున్నాడు. దీనిపై తహసీల్దార్ తక్షణమే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, మోదకొండమ్మ అమ్మవారి ఆలయ కార్యదర్శి ఒమ్మి మధు సోమవారం కోరారు. ఆలయానికి వెళ్లే రహదారిలో గ్రెవెల్స్ వేసి గత మూడు రోజులుగా చదును చేసి ఆక్రమించినప్పటికీ స్థానిక వీఆర్‌వో, వీఆర్‌ఏలు చూసీచూడనట్లు వ్యవహించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గ్రామ ప్రజలు సహకారంలో తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తామన్నారు.

వన్యప్రాణుల పరిరక్షణ అందరి బాధ్యత



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఎస్.రాయవరం: వన్యప్రాణుల పరిరక్షణ అందరి బాధ్యత అని అనకాపల్లి డివిజన్, యలమంచిలి రేంజ్ పాయకరావుపేట సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్లు ఎల్.విజయ్‌కుమార్, ఎం.కృష్ణ అన్నారు. చినగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వన్యప్రాణులను ఎలా రక్షించాలి, వాటి వల్ల ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సత్తిబాబు, పీడీ ప్రేమ్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ కె.రమణమ్మ, పి.ఆచారి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ బి.వై.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్ ఖాన్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షీయాజ్ ఖాన్

నర్సీపట్నం: బాలికలపై జరుగుతున్న దుశ్చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు అనేక చట్టాలు ఉన్నాయని సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్ ఖాన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం చైల్డ్ మ్యారేజ్, గుడ్ టచ్...బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలను ఉద్దేశించి జడ్జి మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. చట్టాలపై కనీస అవగాహన ఉండాలన్నారు. పోక్సో చట్టం చాలా తీవ్రంగా ఉంటుందన్నారు. ఈ కేసులో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. బాల్య వివాహాలు ప్రోత్సహించకూడదన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారు శిక్షార్హులు అవుతారన్నారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారులపై కామాంధుల కళ్లు పడుతున్నాయని, చాలా సందర్భాల్లో తెలిసిన వారే దుశ్చర్యకు ఒడిగడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి బారిన పడకుండా మన పిల్లలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ చెప్పాలన్నారు. బాలికలపై లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో సీఐ గోవిందరావు, ఎల్.రేవతమ్మ, ఎంఈవో తలుపులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్షయ వ్యాధి నివారణ సాధ్యమే



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న వైద్యాధికారి వెంకటేష్

రాంబిల్లి(యలమంచిలి): క్షయని ముందుగా గుర్తించి మందులు వాడితే వ్యాధి నివారణ సాధ్యమేనని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ అన్నారు. ప్రధానమంత్రి టీబీ విముక్తి భారత పంచాయతీలుగా రాంబిల్లి మండలంలోని మురకాడ, మామిడివాడ, కట్టుబోలు, లాలం కోడూరు గ్రామాలు ఎంపికయ్యాయి. ఈ మేరు సోమవారం దిమిలి పీహెచ్‌సీలో ఆయా పంచాయతీల కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా పంచాయతీ కార్యదర్శులకు జిల్లా వైద్యా ఆరోగ్యశాధికారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు జారీ చేస్తామన్నారు. దగ్గు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, రోజు విడిచి రోజు జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే క్షయగా అనుమానించి వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.ఎన్.రాజు, పంచాయతీ కార్యదర్శులు కె.అమ్మాజీ, బి.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.